మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## శరవేగంగా గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, జూలై 10,ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన, 41 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, 11 లక్షలతో పుట్టుగూడలో నిర్మించిన అంగన్‌వా భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోని కాలనీలలో మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, మాజీ సర్పంచ్ శివరాజ్, వడ్డే కృష్ణ, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

12 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలో

## సిటీ పోలీసు యాక్ట్ అమలు : సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 12 నుంచి 27 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ డాక్టర్ అనురాధ గురువారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, రాల్యీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బందల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురిచేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


గురుపూర్ణి వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

### హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ఝరాసంగం, జూలై 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో గురువారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహను అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి దత్త యజ్ఞాన్ని ప్రారంభించి పూర్ణహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాలను, దత్తాత్రేయ స్వామి, పంచ వృక్షాలను, శనైశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహను దత్తగిరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, నాయకులు రామ్‌రెడ్డి, సిద్ధన్నపాటిల్, వేణుగోపాల్‌రెడ్డి, రాఘవేంద్ర, రాజు స్వామి తదితరులు పాల్గొనగా డిఎస్పి సైదా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మహిళలు, బాలికలకు

## రక్షణ కవచంగా షీటీమ్స్ పనిచేయాలి

### సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతునసిపి డాక్టర్ అనురాధ

షీటీమ్ అంటే మహిళలకు, బాలికలకు రక్షణ కవచంగా పని చేయాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. షీటీమ్, భరోసా సిబ్బందితో మహిళల,పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై గురువారం తన కార్యాలయంలో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్ బాడ్ టచ్‌పై పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హాట్ స్పాట్స్ రోజుకు మూడు,నాలుగు సార్లు సందర్శించాలన్నారు. ఫిర్యాదు బాక్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. హాట్స్పాట్స్‌పై నిఘా మరింత పెంచాలన్నారు. షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఎసిపిలు వారానికోమారు మానిటర్ చేయాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చెరువు పార్కులు, దేవాలయాలు, అక్సిజన్ పార్క్, రాజీవ్ పార్క్,బస్టాండ్లు, కాలేజీల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రజల రక్షణకు ఎల్లవేళల అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. సమీక్షలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌బి సిఐ కిరణ్, షీటీమ్, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞానాంధకారాన్ని తొలగించి

## జ్ఞానాన్ని ప్రసాదించే వారే గురువు

### -బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి

**వర్గల్, జూలై 10 (ప్రభాతవార్త):** గురువు క్షేత్రమైతే శిష్యుడు విత్తు కాగా, ఆ ఇద్దరి మేలు కలయికతో జ్ఞానమనే బంగారు పంట పండుతుందని శ్రీ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. గురువారం వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర ఆవరణలోని శ్రీ కంచి శంకరమఠంలో ఆలయ కమిటీ సభ్యులు గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ప్రసంగిస్తూ భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, ఉన్నతమైనదని, అయితే వ్యక్తి, సమాజ, దేశ వికాసానికి గురువు అనుగ్రహం, ప్రోత్సాహం, మార్గదర్శనం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ముఖ్యంగా సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు స్వరూపమే వ్యాస మహర్షి ఉద్భవం కాగా, ఆయన అందించిన వేదాలు మానవ మనుగడకు మూలమని పేర్కొంటూ అవి జ్ఞాన పరంపరను ప్రకాశింపజేస్తాయని తెలిపారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే వారు గురువు కాగా, ఉత్తమ గురువు కోసం శిష్యుడు ఎలా తపిస్తాడో అదే స్థాయిలో గురువు సైతం శిష్యుడి ఉన్నతిపై దృష్టి పెడతాడని అన్నారు. గురువు జ్ఞానధారను ఒడిసి పట్టుకున్న శిష్యుడు సమాజ శ్రేయస్సుకు పరితపిస్తేనే గురువు లక్ష్యం సిద్ధిస్తుందని చెప్పారు. అద్భుత ప్రపంచాన్ని తీర్చిదిద్దే శక్తిని గురువు శిష్యునికి అందిస్తుండగా, ప్రశ్నించే, శోధించే తత్వంతో శిష్యుడు సమున్నతంగా తీర్చిదిద్దబడతాడని పేర్కొన్నారు. శిష్యుడు ఉన్నతిని గురువు ఆకాంక్షిస్తుండగా, ఆ బంధం జీవితాంతం గుర్తుంటుందని వివరించారు. కాగా మొదటగా సిద్ధాంతి చంద్రశేఖరశర్మ, అరుణ దంపతులకు దాత సుర్వి భీష్మగౌడ్ దంపతులు పాదపూజ నిర్వహించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు దాచేపల్లి వెంకటకృష్ణారావు, బొమ్మిడాల సత్యనారాయణ, పొద్దుటూరి నర్సింహరావు, గుడాల కృష్ణమూర్తి, గంగ శ్రీనివాస్, ఇర్రి మల్లారెడ్డి, శ్రీరామ్ పండరి, రంగయ్య, రాజేశ్వరరావు, పుష్పాల్‌రెడ్డి, నూక బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖరశర్మ సిద్ధాంతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

# డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి అవాస్ యోజన, డబుల్ బెడ్‌రూం పథకాలలో పక్కా గృహాలు నిర్మించి ఇస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య పేర్కొన్నారు. గురువారం ప్రధాన మంత్రి కార్యాలయ అధికారి మన్మిత్‌కౌర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్‌తో కలిసి కలెక్టర్ రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూం లబ్దిదారులతో కలిసి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు లబ్దిదారులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో బిఎస్‌ఎన్ టవర్, బ్యాంక్, పోస్టాఫీసు, ప్రైమరీ ఇంటర్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు కల్పించనున్నామని తెలిపారు. 2 బిహెచ్‌కె కాలనీ నుంచి హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లబ్దిదారులు నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా కృషి చేయాలని సూచించారు.ఇళ్ల పరిసరాల్లో పచ్చ మొక్కలు నాటుకుని సంరక్షించుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న మహిళా సాధికారతలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి,జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

- * నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- * ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం
- * విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- * సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**జగదేవ్‌పూర్, జూలై 10 (ప్రభాతవార్త):**
అర్హులైనవారికే ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంతోపాటు తీగుల్ గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తీగుల్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి డ్యూటీ డాక్టర్ రాలేదని ఆరాతీయగా వట్టిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంప్‌కు వెళ్ళారని సిబ్బంది తెలిపారు. రోగులకు వైద్యం అందించడం డాక్టర్ ముఖ్యమైన విధి అని, విధులను నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రోజూ 9 గంటలకే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యం విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, అన్ని పరికరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. తరచూ పిహెచ్‌సిని మండల అధికారులు తనిఖీ చేసి సక్రమంగా నడిచేలా చూడాలన్నారు. గతకొంత కాలంగా షార్ట్‌సర్క్యూట్ వల్ల కరెంటు రావడంలేదని తెలపగా వెంటనే విద్యుత్ శాఖ అధికారులను తాత్కాలికంగా కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదనంతరం తీగుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో వంట చేయడంలో ఆలస్యం, నీరు వృధాగా పోయినా పట్టించుకోవడంలేదని వంట సిబ్బంది నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం రోజు వంట చేయడంలేదని ప్రిన్సిపాల్ వంట సిబ్బందిపై కంప్లైంట్ చేయగా మెనూ ప్రకారం భోజనం అందించకపోతే విధుల నుండి తొలగిస్తామని హెచ్చరించారు.
నిర్లక్ష్య పనులు, సమాధానాలు తెలిపితే ఉపేక్షించేది లేదని ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు. ఎంపిడిఓ రోజూ పాఠశాలలను మానిటరింగ్ చేయాలని, మెనూ పాటించేలా చూడా లన్నారు.మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం అందించడం లేదని ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల పట్ల సహృదయంతో మెలగాలని, సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. అలాగే తీగుల్ గ్రామం లో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో 43 మంది లబ్ధిదారులు ఉండగా 22 గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్ణీత కాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, ఎంపిడిఓ పి.రాంరెడ్డి, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తీగుల్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ హైమావతి

## హుస్నాబాద్ నుంచి మేడారంకి ప్రత్యేక బస్సు

**హుస్నాబాద్ రూరల్, జూలై 10, ప్రభాతవార్త :**
హుస్నాబాద్ నుండి మేడారం సమ్మక్క, సారలమ్మ దేవస్థానానికి ఈనెల 13వ తేదీన ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ ప్రాంత భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా నడిపించే ఈ బస్సు 13వ తేదీన ఉదయం 6 గంటలకు హుస్నాబాద్ నుండి బయలుదేరి వేయి స్థంబాల గుడి, రామప్ప దేవాలయం, లక్నవరం, బోగత జలపాతం నుండి మేడారం చేరుకుంటుదన్నారు . సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళ్లాలనుకునే భక్తులు ఈ బస్సును సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాల కోసం 7382847741, 7372852772 నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

# అనుమతులు లేవు .. అడిగే వాళ్లూ లేరు..!

### రెచ్చిపోతున్న మట్టి మాఫియా.. విచ్చలవిడిగా తవ్వకాలు.. చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

**హుస్నాబాద్ రూరల్, జూలై 10, ప్రభాతవార్త**
అనుమతులు లేవు.. అడిగేవారు లేరు... ఇంకే ముంది గుట్టలు తవ్వేస్తున్నారు.. లక్షలు విలువచేసే మట్టిని దోచుకెళుతున్నారు. అక్రమార్కులకు మట్టి వ్యాపారం కొద్ది రోజులుగా కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదా యానికి భారీగా గండిపడుతుంది. హుస్నాబాద్, అక్కన్న పేటతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ ప్రభుత్వ ప్రైవేట్ భూముల్లో ఉదయం, రాత్రి తేడా లేకుండా జెసిబిల సహాయంతో మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల పట్టణంలోని సబ్‌స్టేషన్ వెనుక ఉన్న నారాయణ చెరువు కుంటలో నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తుండగా ఒక ట్రాక్టర్ బోల్తాపడి హుస్నాబాద్‌కు చెందిన యజమానికి తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కన్నపేట మండలం రేగొండ గ్రామంలో రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసు కోకుండా పెద్ద పెద్ద జెసిబిలు, హిటాచీల ద్వారా లారీల సహాయంతో హుస్నాబాద్ మండలంలోని పందిల్ల బ్రిడ్జి వద్దకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.అక్రమ మట్టి దందా కొంతమంది చోటా.. మోటా నాయకులతోపాటు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అండతో మూడు పువ్వులు ఆరు కాయల్లా సాగుతోందని స్పష్టంగా అర్థమౌతుంది.

**అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు...**
మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగానే ఈ దందా సాగి స్తున్నారని తెలిసినా అధికారులు ఇటు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల వారి తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబందనల ప్రకారం మట్టి తవ్వ కాలు జరపాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమ తులు తీసుకుని క్యూబిక్‌మీటర్‌కు కొంత మొత్తం చొప్పున (రాయల్టీ) డబ్బులు చెల్లించి తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నిబందనలు ఇక్కడ అమలు కాకపోగా అక్రమార్కులు ఎప్పుడు, ఎవరికి మట్టి అవసరం వచ్చినా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతూ పెద్దఎత్తున ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు.

**రేగొండ చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం...**
అక్కన్నపేట మండలంలోని రేగొండ గ్రామ ఊరి చెరువు పక్కనే ఆనుకుని ఉన్న గుట్టను రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు జెసిబిలు, హిటాచిలతో తవ్వకాలు జరపడంతోపాటు మట్టిని లారీల ద్వారా కట్టపైనుంచే రవాణా చేస్తుండడంతో చెరువు కట్ట కుంగిపోయే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మా భూమిలోఉన్న గుట్టను తవ్వుకుంటున్నామని గ్రామస్తులను బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే గుట్ట తవ్వకాలు ప్రారంభించిన మొదటిలోనే మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో మట్టి తరలిస్తున్న లారీలను మాజీ సర్పంచ్ పీసర సునీత రాములు గ్రామస్తులతో కలిసి అడ్డుకుని లారీల ద్వార మట్టి, దుమ్ము, దూళి ఇళ్లల్లోకి వస్తుందని అడ్డుకున్నారని అయితే ప్రతీ రోజు రోడ్డుకు నీళ్లు పడుతూ మట్టికొట్టు కుంటామని వారికి నచ్చజెప్పి ఈ దందాను సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, మైనింగ్ అధి కారులు చొరవ చూపి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని మేదావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.


రేగొండలో చెరువు పక్కన గుట్టను హిటాచీతో తవ్వుతున్న దృశ్యం


కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

## కానిస్టేబుల్‌కు బంగారు పతకం

**చిన్నశంకరంపేట, జూలై 10,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టెబుల్ శ్రీధర్‌గౌడ్ విధి నిర్వహణాలో తెలంగాణ జోనల్ పోలీస్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. కరీంనగర్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో తెలంగాణ పోలీస్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఫొటో, వీడియో చిత్రీకరణలో శ్రీధర్‌గౌడ్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి బంగారు పతకాన్ని సాధించారు. త్వరలో వరంగల్‌లో రాష్ట్రస్థాయి డ్యూటీమీట్ పోటీలో పాల్గొంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్‌రావు కానిస్టెబుల్ శ్రీధర్‌గౌడ్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్‌తో పాటు, పోలీస్ సిబ్బంది ఆయనను అభినందించారు.

## వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### సెర్ప్ డిపిఎం ప్రకాశ్

**వర్గల్, జులై 10 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెర్ప్ డిపిఎం ప్రకాశ్ అన్నారు. గురువారం వర్గల్ మండలకేంద్రంలో ఇందిర మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు కళాజాత కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆనంద్, సిసిలు, గ్రామ సంఘ అసిస్టెంట్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, ఎస్‌హెచ్‌జి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

### కట్నం కోసం అత్తింటివారే వేధించి చంపారని బాధితుల ఆరోపణ..

**టేక్మాల్, జూలై 10 ప్రభాతవార్త:** అనుమానాస్పదస్థితిలో(మైనర్) వివాహిత మృతి చెందిన సంఘటన టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్ మహమ్మద్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... హసన్‌మహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన బీరప్ప, పోచమ్మలకు సంతానం లేకపోవడంతో పెద్దశంకరంపేటమండలం మూసాపేట గ్రామానికి చెందిన బంధువుల కుమారుడు గంగారాంను దత్తత తీసుకున్నారు. హసన్ మహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన బీరప్ప ఆదే గ్రామానికి చెందిన వరుసకు బావమరిది సాయిలు మూడో కూతురు మానసను గంగమేశ్వర్‌కు 2024 లో ఇచ్చి 16 నెలల క్రితం పెళ్లి చేశారు. పెళ్లి సమయంలో వరకట్నంగా బైక్, రూ. లక్షనగదు, ఐదుతులాల బంగారం ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. కాగా అది ఇవ్వకపోవడంతో భార్యాభర్తల మధ్య కొంత కాలంగా గొడవ జరుగున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా మానస (18) 8 నెలల గర్భవతి. కాన్పు నిమిత్తం తీసుకెళదామని మానస తల్లి బేతమ్మనవచ్చి అడగ్గా భర్త గంగమేశ్వర్ పంపించలేదన్నారు. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరను దూలానికి వేసి ఆత్మహత్య చేసుకుందని గ్రామస్థులు చెప్పారు. విషయం తెలుసుకున్న భర్త గంగమేశ్వర్ ఇంటి పైకప్పు నుంచి పెంకులు తీసి ఇంట్లోకి దిగి ఇరుగుపొరుగు సహాయంతో ఆత్మహత్య చేసుకున్న మానస మృతదేహాన్ని కిందకు దించినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేటకు తరలించగా మానస గర్భవతి కావడంతో సంగారెడ్డి జిల్లా తరలించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ రేణుకరెడ్డి. టేక్మాల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌తో పాటు క్లూస్ టీం సందర్శించి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు. మృతురాలు మానస(17) భర్త గంగమేశ్వర్ (19) ఇద్దరు మైనర్లు కావడం గమనార్హం.

## బస్సు కిందపడి గుర్తు తెలియని యువకుడి మృతి

**మనూర్, జూలై 10, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు(టిఎస్ 15జడ్ 0083) వెనకాల టైరు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాయిపల్లి బస్టాండ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం... గురువారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బస్టాండ్ వద్ద బస్సు వెనకాల టైరు కిందపడి గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడన్నారు. ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి ముఖం పూర్తిగా నుజ్జు కావడంతో గుర్తు పట్టలేని విధంగా మారిపోయిందన్నారు. మృతి చెందిన యువకుడిని గుర్తిస్తే మనూర్ పోలీసు ఠాణా(8712656758)కు సమాచారం అందించాలని ఎస్ఐ కోటేశ్వర్‌రావు కోరారు.

## ఎండుగంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**మునిపల్లి, జూలై 10(ప్రభాతవార్త):** మునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఒక వ్యక్తి యాక్టివాపై గంజాయి తరలిస్తున్నట్టు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రాజేష్‌నాయక్ సిబ్బందితో కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ నుంచి వస్తున్న యాక్టీవా స్కూటీ(టిజి09బి0821)ని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభ్యమైందన్నారు. చింతాల్మెట్టుకు చెందిన మహ్మద్ సమీర్ (25) బీదర్‌లోని ఇరానీ గల్లీలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారన్నారు. అతని వద్ద 6 కిలోల 400 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని నిందుతుడిని జైలుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజశేఖర్‌తో పాటు ఏఎస్సై బక్కన్న, సిబ్బంది హనీఫ్, పాండు, సునీల్‌లను సిఐ సుమన్‌కుమార్ అభినందించారు.



ఎండుగంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

## భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా మందిరం



సాయిబాబా మందిరంలో దర్శనంకోసం బారులుతీరిన భక్తులు

**సదాశివపేట, జూలై 10, ప్రభాతవార్త:**
గురుపౌర్ణమి సందర్భంగా సదాశివపేటలోని సాయిబాబా మందిరంలో ఉదయాన్నే సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం హారతి ఇవ్వడం జరిగింది. మధ్యాహ్న హారతిలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**సదాశివపేట, జూలై 10, ప్రభాతవార్త:**
సదాశివపేటలోని చాపలకేరి శ్రీమహంకాళీ మందిరంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు కుంకుమార్చన, అభిషేకం, హారతి ఇవ్వడం జరుగింది. అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమిన అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల సుధాకర్, హనుమంతు, శంకర్, సతీష్, మహేష్, శంకర్, చాపల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పాలనలో అపరిశుభ్రత

**-దోమలతో పోరాటం...**



కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

**చిన్నశంకరంపేట, జూలై 10, ప్రభాతవార్త:**
మండలంతో పాటు పలు గ్రామాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రత్యేకపాలనలో నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించడం లేదు. అసలే వర్షాకాలం అపరిశుభ్రత ఆపై చీకటిపడితే చాలు ఎక్కడికి వెళ్ళినా దోమలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పల్లెల్లో ప్రధాన రోడ్డుతోపాటు, అంతర్గతరోడ్లలో వర్షంనీరు చేరడంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. మండల పరిధి కొర్విపల్లి తండాలో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుందని, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బోరు ద్వారా తండావాసులు మంచినీళ్లు పట్టుకుంటారు. ఆబోరు చెడిపోవడంతో పంచాయతీ సిబ్బంది మరమ్మతులకు తీసుకెళ్లి నెలరోజులు గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేయించలేదని వారు తెలిపారు. ఈ విషయమై వార్త పంచాయతీ కార్యదర్శి సమతను వివరణ కోరగా బోరు మోటారు గత రెండు నెలల్లోనేరెండు సార్లు చెడిపోయిందని, మరమ్మతులు చేయించానని, తండావాసులు ఉదయం నుండి సాయంత్రం వరకు బోరు మోటారును ఆన్‌చేసి అలాగే ఉంచుతున్నారని, నీరు వృథాగా పోతున్నా వారు దానిని ఆఫ్‌చేయడం లేదన్నారు. పలుమార్లు తండావాసులకు ఈవిషయంపై చెప్పానని, అవసరం ఉన్నప్పుడు మాత్రమే బోరును వేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. బోరు మోటారును మరమ్మతులకు ఇచ్చాము, రెండు రోజుల్లో దానిని బిగిస్తామని తెలిపారు. తండాకు రోడ్డు మంజూరై మట్టినిపోశారు. వర్షం కురిసిన ప్రతిసారి మట్టి కొట్టుకుపోయి మురుగుకాలువలకు వస్తుందని తెలిపారు. పరిశీలించి పారిశుధ్య కార్మికులతో మట్టిని మళ్లీ తీయిస్తామని తెలిపారు.

**ప్రత్యేక పాలనలో అలసత్వం..**

వర్షాకాలం వచ్చిందంటే సర్పంచ్‌లు గ్రామ పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ చల్లించేవారు. కాని ప్రత్యేకపాలనలో అది కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్తవేయడంతో వాటిలో దోమలు తిష్ఠ వేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం అది కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు.

**మూలన యంత్రాలు..**

పలు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ప్రత్యేక పాలనలో వాటిని ముట్టుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీల్లో నిధులలేమితో పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా పరిశుభ్రతపై దృష్టి సారించకుంటే దోమలు వ్యాప్తిచెంది రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులకు ఉచిత బస్సు సదుపాయం

**కొందుర్గు, జూలై10, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 26 వేలకు పై ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీ సభ్యులు కొందుర్గు డిప్యూటీ తహసీల్దార్‌కు విజ్ఞాపన పత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, వారిలో 60 శాతం మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాలకోర్చి పాఠశాలలకు వస్తుంటారని, అలాంటి విద్యార్థులకు ఉచితంగా బస్సు సదుపాయం కల్పిస్తే వారు మరింత మెరుగైన విద్యను నేర్చుకుంటారని వినతిపత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పెంటయ్య, డప్పు రవీందర్, రాములు, సంజీవ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు భూమి పూజ..

**దౌల్తాబాద్, జూలై 10, ప్రభాతవార్త:**
సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారంరోజు దౌల్తాబాద్ మండల కేంద్రంలో మూడవ, నాల్గవ సెంటర్లకు సంబంధించిన అంగన్వాడి భవనాల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడి వెంకట్‌రెడ్డి, జంగం వీరన్న, మాజీ ఎంపీటీసీ మంజులదస్తప్ప మాట్లాడుతూ.. అంగన్‌బాడీ కేంద్రంలో విలువైన సరుకులు సైతం త్వరగా పాడైపోయాయని, ఇట్టి సమస్యను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డికి తెలియజేయగానే వెంటనే రెండు భవనాలకు 40 లక్షల నిధులు మంజూరు చేశారని, మిగిలిన నాలుగు భవనాల నిర్మాణానికి మరింత నిధులు సమకూరుస్తామని తెలపడం జరిగిందని అన్నారు. పంచాయతీరాజ్ ఏఈ నాగెందర్, కురుమని కృష్ణ, వల్లిగిరి ఆశప్ప, మల్కయ్య గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృతి

**షాబాద్, జులై 10, ప్రభాతవార్త:** విద్యుత్ ఘాతంతో పాడి ఆవు చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని కేసారం గ్రామంలో గురువారంచోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన కావలి రవీందర్ తన పాడి ఆవును వ్యవసాయ పొలంలో మేత మేపుతుండగా, పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ సమీపంలోకి వెళ్ళింది. దీంతో విద్యుత్ త్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. తనకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

# ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో అలసత్వం వద్దు...

**దుబ్బాక, జూలై 10, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీలో వాణిజ్య, వ్యాపార దుకాణాలకు సంబంధించి నత్తనడక సాగుతున్న ట్రేడ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను మరింత వేగవంతంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.రమేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్‌లజారీ, భువన్‌యాప్‌లో వివరాల నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీలోని 7,15వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ళకు సంబంధించి లబ్దిదారుల సమక్షంలో గృహనిర్మాణశాఖ ఎఈ జాహ్నవితో కలిసి ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భువన్‌యాప్‌లో మున్సిపాలిటీలోని ఆస్తులసమాచారాన్ని నమోదుచేయడం, మ్యాపింగ్‌చేయడం, ఆస్తిపన్నులవసూలకు అవసరమైన వివరాల నమోదును పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఆలస్యం చేయకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణాలను చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలో మంజూరైన 346 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 167 మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, వార్డ్ ఆఫీసర్ లింగం, మున్సిపాలిటీ సిబ్బంది ఉన్నారు.



ఇళ్ల స్థలలాను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌కుమార్

## నాచగిరి క్షేత్రంలో వేలంపాట



నాచగిరి ఆలయ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

**వర్గల్, జూలై 10, ప్రభాతవార్త:**
వర్గల్‌మండలంలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మాస్వామి దేవస్థానంలో ఆలయకమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, సిద్దిపేట సంతోషిమాత దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌రెడ్డిల పర్యవేక్షణలో గురువారం వేలంపాట నిర్వహించారు. ఈవేలంపాటలో స్వామివారికి పూలహారాలు, అలంకరణకు పూలు అందజేసేందుకు వేలంవేయగా తక్కువధరకు గజ్వేల్‌కుచెందిన ఎ. నరేందర్ వేలంపాడి కైవసం చేసుకున్నారు. అలాగే సికింద్రాబాద్‌కు చెందిన వీరభద్ర జ్యూవెలర్స్ వెండి, కాపర్ డాలర్లు, రక్షాకంకణాలు సరఫరా చేయుటకు, శ్రీలలితాట్రేడర్స్ శాలువాలు, చెల్లాలు, కనుములు మొదలైనవి సరఫరా చేయుటకు వేలంలో దక్కించుకోగా తలనీలాలు ప్రోగుచేసుకొనుటకు సికింద్రాబాద్‌కు చెందిన పి.ఎల్లయ్య 4.56లక్షలకు వేలంపాడగా, పాదరక్షలు భద్రపరచుటకు నాచారంకు చెందిన విజయలక్ష్మి 1.35 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు. స్వామివారి శేష వస్త్రములు ప్రోగు చేసుకొనుటకు సరైన పాట రానందున వేలం రద్దుచేయబడినదని, టెంట్ సామగ్రి కిరాయికి, ఒడిబియ్యం ప్రోగు చేసుకొనుటకు, ధరావతుదారులు పాల్గొననందున వేలం వాయిదా పడినదని తెలిపారు. ఈవేలంపాటలో ధర్మకర్తలు నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, కర్రె పద్మవెంకటేష్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, బి. జగన్నాథచార్యులు, ముఖ్య అర్చకులు, ఎక్స్‌అఫీషియో మెంబర్, సిబ్బంది సుధాకర్, నరేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం ప్రభుత్వమే ఉచితంగా ప్రజలకు అందించాలి

**-నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి**
**-ప్రజా సంఘాల డిమాండ్**



సిఐటియు అధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

**కొండపాక, జూలై 10, ప్రభాతవార్త:**
విద్య, వైద్యం ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా దుద్దెడలోని ప్రధానవీధుల గుండా, రాజీవ్ రహదారిపై సిఐటియు, తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం, ప్రజాసంఘాలు, కార్మికసంఘాల అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కనకచారి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యులు రవీంద్రచారితో కలిసి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవలంబిస్తున్నవిధానాలను ఉపసంహరించుకోవాలని, కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, ప్రైవేటీకరణ విధానాలను రద్దుచేయాలని, విద్య, వైద్యం, ఉపాధి ప్రభుత్వ అధీనంలోనే కొనసాగించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని, నిరుద్యో గులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బర్మా కొమురయ్య, జగపతి నాగులు, ఎండి కరీం, గజభీంకర్ బాలకిషన్, జాలిగామ ప్రభాకర్, అరుట్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య నేర్పిన గురువులను మరువరాదు: వైఎస్ఆర్

**ఘట్‌కేసర్, జూలై 10, ప్రభాతవార్త:** విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికి మారువరాదని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. విశ్రాంత అధ్యాపకులు సూర్యప్రకాష్ దంపతులను గురువారం ఆయనను శాలువాతో సన్మానించి పాదాభివందనం చేశారు. మాజీ ఎంపిపి తనకు ఇంటర్మీడియట్‌లో బయాలజీ బోధించిన సూర్యప్రకాష్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని సత్కరించి ఆశీస్సులు పొందారు. గురువు లేనిదే విజ్ఞానం లేదని గురుపౌర్ణమిన సార్‌ను సన్మానించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, నాయకులు గొంగళ్ల బాలేష్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా మహిళాశక్తి సంబరాలు



సిసి అనురాధను సన్మానిస్తున్న మహిళాసంఘం సభ్యులు

**జగదేవ్‌పూర్, జూలై 10, ప్రభాతవార్త:**
జగదేవ్‌పూర్ మండలపరిధిలోని దౌలాపూర్, గొల్లపల్లి, అలిరాజపేట గ్రామాల్లో గురువారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళాసమాఖ్య ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి సిసి అనురాధ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, ఇందిరా మహిళాశక్తిలో భాగంగా కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించేందుకు క్యాంటీన్లకు, బస్సులకు యజమానులనుచేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం, సోలార్ యూనిట్లు ఏర్పాటుచేయడం జరుగుతుందని అన్నారు. ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వడ్డీలేని రుణాలను మహిళాసంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివోఏలను, సిసిలను మహిళాసంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మహిళా సంఘం అధ్యక్షులు కొన్నె జయమ్మ, మంజె నర్సమ్మ, ముక్కెర పోచమ్మ, వివోఏలు శివదాస్, రమేష్, ఆశ వర్కర్లు పద్మావతి, మహిళా సంఘం సభ్యులు నవీన, ప్రియాంక, స్వప్న, సుశీల, లావణ్య, ఉప్పలమ్మ, దేవేంద్రలక్ష్మి పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహ్మాస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, జూలై 10, ప్రభాతవార్త:**
ఉమ్మడిమెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి గురువారం తన జన్మదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనృసింహ్మాస్వామిని తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి దంపతులను స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనృసింహ్మాస్వామి కరుణకటాక్షాలతో అందరూ బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

**ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన నేతలు...**

ఉమ్మడిమెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని వారి స్వగృహంలో గజ్వేల్ ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహిపాల్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20వవార్డు మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, వార్డు మాజీ అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్, నిమ్మ రమేష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చక్కని చేతిరాత అందరికీ సాధ్యమే

**-ఎంఈఓ వెంకటరాములు**



చేతిరాతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆజాద్ అహ్మద్

**మర్కుక్, జులై 10 (ప్రభాతవార్త):**
కష్టంతోకాకుండా ఇష్టంతో కష్టపడితే ప్రతివిద్యార్థికి చక్కని చేతిరాత సాధ్యమేనని మండల విద్యాధికారి వెంకటరాములు అన్నారు. గురువారం మండల పరిధిలోని దామరకుంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఎంఈఓ వెంకటరాములు ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా ప్రముఖ చేతిరాత నిపుణులు ఆజాద్ అహ్మద్ చేత విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు అందమైన చేతిరాతను బాల్యదశ నుండే అలవర్చుకున్నట్లయితే పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవడమే కాకుండా ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు కేశవరెడ్డి, సుభాష్‌చందర్, వెంకటనర్సింహారెడ్డి, చిన్న బ్రహ్మయ్య, పుష్పలత, జయశ్రీ, మణిమాల, రాజిరెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇక్రిసాట్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని డైమండ్ పాయింట్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రహదారి విస్తరణలో భాగంగా ఇక్రిసాట్ రైల్వే ఫెన్సింగ్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, జాతీయ రహదారి సంస్థ అధికారులతో కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని డైమండ్ పాయింట్ హోటల్ వద్ద గల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మరో చోటుకు మార్చేందుకు తరలించాల్సి ఉందని, అందుకు ముందస్తుగా తగు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ డీఈ రామకృష్ణ, నాయకులు బూరుగడ్డ నగేష్, పరమేష్ యాదవ్, దళిత సంఘాల ప్రతినిధులు రుద్రారం శంకర్, కావలి శ్రీరాములు పాల్గొన్నారు.

## మహిళా అధికారిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వకర్మ సంఘం నాయకులు

**కొండపాక, జూలై 10, ప్రభాతవార్త:**
భద్రాచలం శ్రీసీతరామచంద్రస్వామి ఆలయభూములను పరిరక్షించేందుకు పురుషోత్తమ పట్టణానికి క్షేత్ర పరిశీలనకు వెళ్లిన మహిళా ఈఓ లాలుకోట రమాదేవిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ బూర్గోజు బాలబ్రహ్మచార్యులు, అసంఘం జిల్లా అధ్యక్షుడు బండోజు నాగభూషణం, ఉపాధ్యక్షులు పేందోట విష్ణుచార్యులు, ప్రధాన కార్యదర్శి ములుగోజు నర్సింహచార్యులు, సలహాదారులు పెందోట ప్రభాకర్ చార్యులు డిమాండ్‌చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఒక మహిళా అధికారి, విశ్వకర్మ ముద్దుబిడ్డపై దాడిచేయడం ఆటవిక చర్య అన్నారు. మహిళా అధికారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం పనిచేస్తున్న అధికారిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షిస్తూ, మహిళా అధికారికి రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈసంఘటనపై దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరిచారి, శ్రీనివాస్‌చారి, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

## బాలలతో పనులుచేయిస్తే కఠినచర్యలు

**-దుబ్బాక సిఐ పాలపు శ్రీనివాస్**

**దుబ్బాక, జూలై 10, ప్రభాతవార్త:**
ఆటపాటలతో చదువుకోవాల్సిన వయసులో ఉన్న చిన్నారులను దుకాణాలలో, హోటల్లో, ఫ్యాక్టరీలలో, ప్రమాదకర ప్రాంతాల్లో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సిఐ పాలపు శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం దుబ్బాక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలను పనుల్లో నియమించుకోవద్దని, 14, 18 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల్ని ప్రమాదకరమైనపనుల్లో నియమించుకోవద్దని సూచించారు. ఎవరైనా బాలకార్మికులతో పనులు చేయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే కార్మిక శాఖకు కాని, పోలీస్‌లకు కాని సమాచారం అందించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపాలని, బాల కార్మికులను పనిలో పెట్టుకున్నవారికి పనిలోపెట్టించినవారికి కఠిన చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా బాల్యవివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే చైల్డ్ వెల్ఫేర్ శాఖకు సమాచారం అందించాలన్నారు. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ, బాలికల అక్రమరవాణా, బాల్యవివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులతో పాటు స్థానికులుకూడా సహకరించాలని కోరారు.

## ఇందిరా మహిళాశక్తి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-ఎంపిడిఓ రాంప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రాంప్రసాద్

**కొండపాక, జూలై 9, ప్రభాతవార్త:**
మహిళాసంఘాల సభ్యులు ఇందిరా మహిళాశక్తిలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని కుకునూరుపల్లి ఎంపిడిఓ రాంప్రసాద్ సూచించారు. కుకునూరుపల్లి మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన స్వయం సహాయక సంఘాల అధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్నపథకాలను విఓఎలు సంఘసభ్యులకు వివరించాలని సూచించారు. సిసి లింగం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేకంగా ప్రమాదభీమా కింద రూ.10లక్షలు, లోన్‌బీమా కింద రూ.2లక్షలను ఒక్క రూపాయి కూడా మహిళలు చెల్లించకుండానే ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ ఇన్సూరెన్సు కోసం 18సంవత్సరాల వయస్సు నుండి 59సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. మహిళలకు అర్థిక చేయూతనందించుటకు మండల సమైక్య ద్వారా, గ్రామ సంఘాల ద్వారా లోన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. లోన్‌లను ఐజిఎ కింద ఇన్‌కమ్ జనరేటర్ యాక్టివిటీ ఏర్పాటు చేసుకొని ఆదాయం వచ్చే వైపు వ్యాపారపరంగా ముందుకు వెళ్ళాలన్నారు. ఎంటర్‌ప్రైజెస్ కింద తీసుకునే లోన్‌లకు వివిధరకాల యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఓఎలు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## కుకునూరుపల్లి మండల ఆర్‌ఎంపి పిఎంపి నూతన కార్యవర్గం ఎన్నిక

**కొండపాక, జూలై 10, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల ఆర్‌ఎంపి, పిఎంపిల నూతన కమిటీని ఈసి మెంబర్లుగా పల్లిపాటి నర్సింలు, దేవి కిరణ్‌కుమార్, ఎండి హమ్మద్ పాషా, బోనాల సుదర్శన్‌లు వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకమిటీ అధ్యక్షులుగా సందుల స్వామి, ఉపాధ్యక్షులుగా ఎండి హమ్మద్ పాషా, కార్యదర్శులుగా కుడిక్యాల శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా చిలివేరి సుకన్య, సంయుక్త కార్యదర్శిగా పేర్ల నాగరాజు, కోశాధికారిగా లకుడారం నర్సింలు, సలహాదారులుగా రుద్రరం రాజు, నాగపూరి నర్సింలు, బోడపట్ల మల్లేశం, తుమ్మ చంద్రశేఖర్, తిప్పారం పాషాలను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీసభ్యులు మాట్లాడుతూ కమిటీ సభ్యుల అభిప్రాయాల మేరకు సంఘం అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లగిశెట్టి కనకయ్య, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, సుదర్శన్, దత్తాద్రి, నాగరాజు, శ్రీనివాస్, ఎన్.నవీన్, దుబ్బాక యాదగిరి, దానమైన కర్ణాకర్, సంఘం సభ్యులు తదితరులందరు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా రక్తదానం చేసిన మహిళలు యువకులు

**నారాయణఖేడ్, జూలై 10, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలో సాయి సంజీవిణి హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంకు ప్రజలు అనూహ్యంగా స్పందించారు. ఉదయం ప్రారంభమైన శిబిరంలో పలువర్గాలకు చెందిన యువకులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈరోజు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60మంది వరకు రక్తదానం చేశారు. వారి సాహసోపేతమైన మానవతా హృదయం అభినందనీయం. ఒక్క యూనిట్ రక్తం అనేకమందికి ప్రాణదాయకం కావొచ్చు" అని అన్నారు. శిబిరం నిర్వహణలో హాస్పిటల్ సిబ్బంది, పలు సేవా సంస్థల సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. శుభ్రత, వైద్యం విషయంలో పూర్తిజాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి రక్తదాతకు ధృవ పత్రాలు అందజేశారు. ఈశిబిరానికి నారాయణఖేడ్ ప్రాంత ప్రజా ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు హాజరై, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువతను అభినందించారు. హాస్పిటల్ వర్గాలు భవిష్యత్‌లో ఈ తరహా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపాయి.


మంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న న్యాయవాదులు

## మంత్రిని కలిసిన న్యాయవాదులు

**హుస్నాబాద్ టౌన్, జూలై 10,ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో సీనియర్ సివిల్ కోర్టును మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో న్యాయవాదులు కలిసి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఒగ్గోజు సదానందం, మాజీ ఏజీపి కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు ఎల్లారెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ధీకొండ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## 16న జెఎసి ఆధ్వర్యంలో మానవహారం


కరపత్రాలు, జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**చేర్యాల, జూలై 10,ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ జేఏసి ఆధ్వర్యంలో ఈనెల 16న పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసి చైర్మన్ వకుళభరణం నర్సయ్యపంతులు కోరారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, జెండాలను ఆవిష్కరించారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ చేర్యాల, మద్దూరు, కొమురవెళ్ళి, దూళిమిట్ట మండలాల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపి, సిపిఎం, టిటిడిపి, టి ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పేదోడి కల నెరవేర్చింది కాంగ్రెస్సే

### జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కొమ్మూరి

**చేర్యాల, జూలై 10, ప్రభాతవార్త :** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం చేర్యాల పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క పేద కుటుంబానికి పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్, పూర్మ ఆగంరెడ్డి, మంచాల చిరంజీవులు, దాసరి కళావతి, ఆడెపు చంద్రయ్య, తుమ్మలపల్లి సంజీవులు, ఆడెపు నరేందర్, తడక లింగం, అందె నానిబాబు, వెలగల దుర్గయ్య, సన్నీ, అంబాల రాములు, పోతుగంటి ప్రసాద్, మల్లిగారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ సమతకు సన్మానం


నూతన ఎస్ఐ సమతను సత్కారిస్తున్న నాయకులు

**మిరుదొడ్డి, జూలై 10, ప్రభాతవార్త :** మిరుదొడ్డి పోలీసు స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సమతను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు మద్దెల రాజేశం, ఎండి.అర్షద్, లక్ష్మీశ్రీనివాస్, ఎం.డి.జహంగీర్, ఎం.డి.నవాజ్, రత్నరెడ్డి, బాలు, మహేందర్, శంకర్, మహేష్, రజిత, రోజ పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

సిద్దిపేట అర్బన్, జూలై 10, ప్రభాతవార్త : పేదలను ఆదుకోవడానికి సంపన్నులతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ వేంకటేశ్వర స్వామి పాత దేవస్థానం అధ్యక్షలు,శ్రీ సంతోషిమాత దేవాలయం మాజీ చైర్మన్ డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం స్వర్గీయ బిక్షపతి జ్ఞాపకార్థం నిరుపేద కుటుంబానికి చెందిన మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్ అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల్లో గురువులకు ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, జూలై 10, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో పట్టణ-2 బిజెపి అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆధ్వర్యంలో గురువారం గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ పాల్గొని గురువులను శాలువాలతో ఘనంగా సత్కారించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తపల్లి రాధావేణుగోపాల్, నాయకులు బొడ్డు సునీల్, బోగి శ్రీనివాస్, సుతారి కార్తీక్, సంతోష్, అరిగే యాదగిరి, సురభి వెంకట్‌రావు, గణేష్, వేణు, చెంది సత్యనారాయణ పాల్గొన్నారు.


గురువులను సత్కారిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

# కొడకండ్లలో ఘనంగా మహిళా శక్తి సంబరాలు

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిర మహిళా శక్తి సంబరాలు కళాజాత ప్రోగ్రామ్ ద్వారా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం ద్వారా అనేక రకాల సంక్షేమపథకాలు అందిస్తుందన్నారు. గజ్వేల్ మండలానికి వడ్డీలేని రుణాలు 669 సంఘాలకు కోటి 60 లక్షలు మంజూరయ్యాయని, అలాగే మహిళా సంఘాలకు 15 లక్షల గోడౌన్ మంజూరు కాగా, 11 లక్షల విలువైన మేక పొట్టేల్లు, పెరటి కోళ్లు, సంఘాలకు పెట్రోల్‌బంక్‌లు,ఆర్టీసీ బస్సులు మంజూరయ్యాయని తెలిపారు. ఎవరైనా మహిళా సంఘంలో ఉండి అర్థాంతరంగా చనిపోతే లోన్ భీమా రూపంలో లక్షా 52వేల రూపాయలు వారి సంఘం లోన్ ఖాతాకు జమ అయ్యేలా చేస్తుందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలో విఓ అధ్యక్షురాలు చైర్మన్‌గా ఉండి పాఠశాలల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు, వసతులు చాలా చక్కగా చేశారని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ మహిళా సంఘాల సభ్యులతోనే కుట్టించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి అంజియాదవ్, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, రమేష్‌గౌడ్, బాల్‌నర్సు, ఏపిఎం దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, సిసిలు కృష్ణలీల, పుష్పలత, నిర్మల, శ్రీనివాస్, నాగరాజు, స్వామి, విఓఏలు రేణుక, స్వప్న, శ్రీలత, రాధిక, గ్రామైఖ్య సంఘాల సభ్యులు, తెలంగాణ సాంస్కృతిక సారధి శ్యామ్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.


ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌ను సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు


బాబాకు అభిషేకం చేస్తున్న దృశ్యం

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**పాపన్నపేట, జూలై 10, ప్రభాతవార్త :** గురు పౌర్ణమిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నపేట సాయిబాబా ఆలయంలో పూజారి విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 108లీటర్ల ఆవుపాలతో భక్తులు అభిషేకం చేపట్టారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**పటాన్‌చెరు, జూలై 10,ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ లోగల సాయిబాబా దేవాలయంలో గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గోపాల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహంలో ఇనుప సామాను వేలం

**చిన్నశంకరంపేట, జూలై 10, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో ఇనుప వస్తువుల వేలం పాటను గురువారం ఏవో ప్రదీప్, వార్డేన్ దర్శన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంపాటలో పాల్గొన్న చిన్న శంకరంపేట పట్టణానికి చెందిన ఎల్లేష్ రూ.71వేల రుపాయలకు వాటిని దక్కించుకున్నారు. వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉన్నతాధికారుల ఆదేశానుసారం బ్యాంకులో జమ చేయనున్నట్లు వార్డేన్ తెలిపారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**చిన్నశంకరంపేట, జూలై 10,ప్రభాతవార్త:** మండల పరిధి ధర్పల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం మెదక్ అసిస్టెంట్ ఇంజనీర్ స్వప్న సహకారంతో హర్ట్ టూ టచ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవినాయక్ నోటు పుస్తకాలను అందించారు. రెండు సంవత్సరాలుగా పదవతరగతి విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజు, పరీక్ష కిట్లను అందిస్తున్నట్లు రవినాయక్ తెలిపారు. ఈ సంవత్సరం 40 మంది విద్యార్థులున్నారని, వారికి స్వచ్ఛంధ సంస్థ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు రమేష్, నరేష్ కుమార్, శ్రీనివాస్, రఘు, జ్యోతి, సుభద్రలు పాల్గొన్నారు.

## సురక్షితమైన బాల్యం మనందరి బాధ్యత....

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 10, ప్రభాతవార్త :** పిల్లల రక్షణ, చట్టపరమైన అవగాహనపై గురువారం రామాయంపేట మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని బీసీ కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. మెదక్ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ, బాలల రక్షణ విభాగం, ప్లాన్ ఇండియా సంయుక్తంగా అవగాహన ప్రచారం రథం ద్వారా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్లాన్ ఇండియా ప్రాజెక్ట్ అధికారి పి.సుజాతరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షతమైన బాల్యం మనందరి బాధ్యత అన్నారు. పిల్లలకి టీకాలు వేయడం ఎంత ముఖ్యమో జనన నమోదు కూడా అంతే ముఖ్యం అన్నారు. అంతేకాకుండా బాల్య వివాహం సామాజిక దూరాచారం మాత్రమే కాకుండా అది చట్టపరంగా శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీం, 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు చైల్డ్ హెల్ప్‌లైన నంబర్ 1098, జాతీయ న్యాయసేవాధికార సంస్థ నంబర్ 15100, పోలీస్ అత్యవసర సేవ నంబర్ 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 లను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.రాహుల్, సోషల్ వర్కర్‌లు కె.భార్గవి, జి.ఎన్. రవి, మెప్మా ఆర్‌పి మర్కు లావణ్యతో పాటు మహిళా సంఘాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 10, ప్రభాతవార్త :** గురుపౌర్ణమి సందర్భంగా రామాయంపేటలో గురువారం శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ అండ్ సైన్సెస్,హైదరాబాద్ సౌజన్యంతో ఉచిత దంతవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. స్థానిక టి.జి.మోడల్ స్కూల్ విద్యార్థులకు ఈ క్యాంపును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ డాక్టరు ప్రొఫెసర్ పరప ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించగా, ఏడుగురు డాక్టర్లు ఐదుగురు పారాసిబ్బంది పాల్గొన్నారు. 163 మంది బాలురకు, 100 మంది బాలికలకు పరీక్షలు చేసి 100 మందికి చికిత్సలు చేశారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మితోపాటు ఉపాధ్యాయులు పళ్ల చికిత్స చేయటానికి సహకరించారు. డాక్టర్ల బృందం ఆటపాటలతో అలరించినారు. అనంతరం గురుపూర్ణోత్సవం సందర్భంగా ఉత్తమ, ఉపాధ్యాయురాలు, పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, డాక్టర్ పరపలకు సన్మానం చేశారు. అలాగే శ్రీ సత్యసాయి సేవాసదనంలో సాయంత్రం 7:30 గంటలకు గీతా పారాయణం ఉంటుందని, గీతబోదాచార్యుడు శ్రీకృష్ణ భగవాన్‌కి అభిషేకం సత్యసాయి సేవాసమితి సభ్యులు ఎనిశెట్టి గౌరీ శంకర్ కుటుంబము మరియు పైడి భానుశేఖర్ కుటుంబముతో పాటు సత్యసాయి సేవాసమితి ఆధ్యాత్మిక కోఆర్డినేటర్‌బలరాజయ్యచే జరిపించినట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమములో కోఆర్డినేటర్ చాచం శంకరయ్య, మహిళా కోఆర్డినేటర్ పైడి భూలక్ష్మి నిర్వహణ చేయగా, ప్రతిరోజు భగవద్గీత పారాయణం చేసే భక్తులు సుమారుగా ఒక 60 మంది పాల్గొన్నారు. చివరగా భగవంతునికి హారతి ఇచ్చి భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు.

## సమాజంలో గురువుల పాత్ర కీలకం

### బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి

**జిన్నారం, జూలై 10,ప్రభాతవార్త:** గురు పౌర్ణమి పురస్కరించుకొని బొల్లారం మున్సిపాలిటీ బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత స్థానం కేవలం గురువులకే దక్కడం వెనుక వారి నిస్వార్థ సేవ మాత్రమే అని, సమాజంలో గురువు పాత్ర కీలకమని భావితరాన్ని నిర్మించేది గురువులే అని కొనియాడారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతి అడుగులోనూ, ప్రతిక్షణంలోనూ అతను ఏదో క్రొత్త విషయాన్ని నేర్చుకునే ప్రతి అంశం వెనుక గుప్తంగా గురువు పాత్ర ఉంటుందని, కానీ ఆ గురువుని మనమందరం ప్రత్యక్షంగా చూడగలిగేది తరగతి గదిలో విద్యనభ్యసించినప్పుడు మాత్రమేనని అన్నారు. కానీ తను నేర్చుకునే ప్రతి అంశంలో దాగి ఉన్న గురువును కూడా గుర్తుంచుకుని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టి రవీందర్ రెడ్డి సీనియర్ నాయకుడు జనరల్ సెక్రటరీ అఖిల్ మోహిత్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లు అమ్మితే కఠిన చర్యలు

### ఎక్సైజ్ సిఐ నరేంద్ర

**చిన్నశంకరంపేట, జూలై 10,ప్రభాతవార్త:** కల్తీ కల్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రామయంపేట ఎక్సైజ్ సీఐ నరేంద్ర అన్నారు. గురువారం చిన్న శంకరంపేట, సూరారం, గవ్వలపల్లి, ఖాజాపూర్, అంబాజీపేట లోని కల్లు దుకాణాలను చిన్న శంకరంపేట ఎస్సై నారాయణ గౌడ్ తో కలిసి పరిశీలించారు. కల్లు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపారు. నిషేధించిన మత్తు పదార్థాలను కల్లులో కలిపి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్లు దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కల్లు సీసాలను ఎప్పటికప్పుడు కడిగి ఉంచాలని తెలిపారు. అనంతరం బాగిర్తి పల్లిలో ఈత చెట్లను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై విజయ సిద్ధార్థ, ఎక్సైజ్ సిబ్బంది. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నశంకరంపేటలో కల్లు దుకాణాలను పరిశీలిస్తున్న అబ్కారి, పోలీసులు

## రక్షణ రంగంలో సవాళ్లను ఎదుర్కోవడానికి

# నూతన సాంకేతికతపై దృష్టి సారించాలి

### లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్నే

**పటాన్‌చెరు, జూలై 10, ప్రభాతవార్త:** రక్షణ రంగంలో సవాళ్లను ఎదుర్కోవడానికి వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయంతో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఎండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసిఈఎం) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్నే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బహుళ విభాగ ఇంజనీరింగ్లో ఉద్భవిస్తున్న ధోరణలు, ఆవిష్కరణలు అనే అంశంపై నిర్వహిస్తున్న రెండురోజుల జాతీయ సదస్సును గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతరస విభాగ పరిశోధనల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం సాధ్యపడుతుందన్నారు. హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ అకాడమికి చెందిన వింగ్ కమాండర్ శివాంచల్ ఆస్థానా భారత వైమానిక దళంపై ప్రేరణాత్మక ప్రసంగంతో సదస్సులలో స్ఫూర్తిని నింపారు. నావికాదళ ఆవిష్కరణలు,నాయకత్వంపై విలువైన పాత్రను భారత నావికదళం కెప్టెన్ (డాక్టర్) తెన్నేటి శర్మ పంచుకున్నారు. గీతం హైదరాబాద్ ప్రాంగణం అదనపు ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు నదస్సుకు సభాధ్యక్షత వహించారు. ఆవిష్కరణ, పరిశోధన సంస్కృతిని పెంపొందించడానికి గీతం విశ్వవిద్యాలయం ప్రణాళికలను వివరించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్య విస్తరిస్తున్న తీరు బహుళ విభాగం సహకారం యొక్క ప్రాముఖ్యతపై లోతైన అవగాహన కల్పించారు. ఉన్నత విద్యా సలహదారు ప్రొఫెసర్ శ్రీనివాస్ సుందరరాజన్ వైమానిక యుద్ధంలో అందివస్తున్న సాంకేతిక అవకాశాలు అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. సదస్సు కన్వీనర్, సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ ప్రీతిఅంబరీష్ పర్వేకర్ సదస్సు ఉద్దేశ్యాన్ని వెల్లడించారు. కో కన్వీనర్లు డాక్టర్ జయప్రకాష్ శ్రీవాస్తవ, డాక్టర్ ఎండి అత్తర్ ఖాన్, డాక్టర్ డి.అనిత, డాక్టర్ కె.ప్రవీన్ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి తరలి వచ్చిన వివిధరంగాలకు చెందిన సాంకేతిక నిపుణులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై తమ అపార అనుభవాన్ని నైపుణ్యాలను పంచుకున్నారు.



గీతం సదస్సులో పాల్గొన్న లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్నే


మొక్కను నాటుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

### ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తన నివాసంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు ఎడారిగా ఉన్న రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పాలనలో కోట్లాది మొక్కలు నాటి హరిత తెలంగాణగా మార్చారని అన్నారు. అదే బాటలో మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ చెప్యాల రాజేశ్వర్‌రావులు గ్రీన్ ఛాలెంజ్‌లో పాల్గొని కోట్లాది మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. అడవులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హరితసేన గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ అనిల్ మొగిలి, మండల ఇంచార్జ్ రాచకొండ మహేష్, తాటికొండ మహిపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పెద్దూరి యాదగిరి, వంటేరు సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయాల్లో ఘనంగా పూజలు

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రసన్ననగర్, హౌసింగ్ బోర్డులో ఉన్న సాయిబాబా దేవాలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా మందిరాల్లో ఉదయం నుండే భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని గజ్వేల్ పట్టణానికి చెందిన పలు పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాద్ రావు తదితరులు పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఈరోజు గురువులను, పెద్దలను పూజించే రోజు అని, ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారన్నారు. అనంతరం దేవాలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు.

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి

## దాతల సహకారం అవసరం : ఎంఇవో

**మర్కుక్, జూలై 10 (ప్రభాతవార్త):** పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం ఎంతో అవసరమని మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 230 మంది విద్యార్థులకు ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిచ్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రతీక్ సీల, ఫౌండేషన్ అధ్యక్షుడు గార్లపాటి మధుసూదన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను అతిథుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అంగడికిష్టాపూర్ పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నడుస్తుందని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, గ్రామస్తుల కృషి మరువలేనిదని కొనియాడారు. దాతల సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు. అనంతరం దాతలను పాఠశాల అధ్యాపకుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సుచి, రమేష్, కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.బాలకిషన్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, సంతోష్, చిన్నికృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, ఎస్ఎంసి చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కుమ్మరి కనకయ్య, నాయకులు మీసాల శ్రీనివాస్‌రెడ్డి, స్టార్ యూత్ సభ్యులు రాముగౌడ్, సుదర్శన్‌గౌడ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.4 కోట్లతో ఫంక్షన్ హాల్ నిర్మాణం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, జూలై 10, ప్రభాతవార్త:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యాదవ సంఘం కళ్యాణ మండపంపనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం గోకుల్ నగర్‌లో నిర్మిస్తున్న కళ్యాణ మండపాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రెండు కోట్ల రూపాయలతో కళ్యాణమండపం పనులు ప్రారంభించామని, తిరిగి జిహెచ్ఎంసి ద్వారా మరో రెండు కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఆధునిక వసతులతో మండపాని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాదవ్, మేకల వెంకటేష్, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

### జీవనజ్యోతి జ్యోతిర్లింగం క్షేత్రం అభివృద్ధికి సంపూర్ణ సహకారం...

**పటాన్‌చెరు, జూలై 10,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన జిన్నారంలో నిర్మిస్తున్న జీవనజ్యోతి జ్యోతిర్లింగం శివాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించేలా దేవాలయాలునిర్మించడం సంతోషకరమన్నారు. జీవనజ్యోతి జ్యోతిర్లింగం క్షేత్ర అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. దేవాలయం నిర్మాణ అంశంలో ప్రతి ఒక్కరి సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులచే ఇప్పటివరకు 200 పైగా దేవాలయాలు నిర్మించడం జరిగిందని గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరిలో పరమతసహనం పొందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి 55 రోజుల హుండీ ఆదాయం రూ.1,04,35,711

**కొమురవెల్లి, జూలై 10, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ 55 రోజుల హుండీలను గురువారం ఆలయ అవరణలో లెక్కించారు. 55 రోజులకుగానూ హుండీల ఆదాయం నగదు రూ.1,04,35,711 రాగా మిశ్రమ బంగారం 120 గ్రాములు, మిశ్రమ వెండి 6 కిలో 100 గ్రాములు, విదేశీ కరెన్సీ 42, మిశ్రమ బియ్యం 16 క్వింటాలు వచ్చాయి. కార్యక్రమంలో ఈవో అన్నపూర్ణ, విజయలక్ష్మీ, మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, మామిడాల లక్ష్మీ, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, ఆలయ అర్చకులు, పోలీసు సిబ్బంది, స్వర్ణకారుడు నర్సింహాచారిపాల్గొన్నారు.


మల్లన్న సన్నిధిలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

## ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీదంపతులు



పంచముఖి ఆంజనేయుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ దంపతులు

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు రామచంద్రాపురంలోని సాయినగర్‌కాలనీలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్సీ దంపతులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదేల్లి రవీందర్, వెంకట్ నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ అధ్యక్షులు అనిల్‌చారి, బొల్లారం అధ్యక్షులు ఆనంద్‌కృష్ణరెడ్డి, గుమ్మడిదల అధ్యక్షులు ఐలేష్, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

## గురువుల పట్ల కృతజ్ఞతగా ఉండాలి

**-కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి దంపతులు**



గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దంపతులు

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీ, మ్యాక్ సొసైటీ కాలనీల్లో గురువారం నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొని సాయినాథ్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువుల పట్ల ప్రతి ఒక్కరు కృతజ్ఞతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

## ముగిసిన పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



పాండురంగస్వామిని దర్శించుకుంటున్న గోదావరి

**చౌటకూరు, జూలై 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వెంకట కిష్టాపూర్ (దేవుని అంగడిపేట)లో గత 6 రోజులుగా కొనసాగిన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. ఆరురోజులపాటు ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాఢమాసం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుక్మిణీపాండురంగస్వామిని గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాలైన చక్రియాల్, శివంపేట, హున్నాపూర్, లింగంపల్లి, వెండికోలు, తాడ్దాన్‌పల్లి, గంగోజీపేట, గొంగ్లూర్, కోర్పోలు, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## గజేంద్ర ఆశ్రమంలో ఘనంగా గురుపౌర్ణమి



గజేంద్ర ఆశ్రమంలో గురువును దర్శించుకుంటున్న భక్తులు

**సిర్గాపూర్, జూలై 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గజేంద్ర ఆశ్రమంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. గురువులు కరణ్ గజేంద్రభారతి మహారాజ్‌ను కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన శిష్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈసందర్భంగా కరణ్‌గజేంద్రభారతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిత్యం కొంతసమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించాలన్నారు. ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత కల్గుతుందన్నారు. ఆశ్రమానికి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని గురువుల ఆశీస్సులు అందుకున్నారు.

## పంచాయతీని సందర్శించిన తమిళనాడు బృందం

**కంది, జూలై 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఎద్దుమైలారం గ్రామపంచాయతీని పునఃనిర్మిత రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ (ఆర్ఆర్‌జిఎస్ఎ)లో భాగంగా నిర్వహిస్తున్న ఉత్తమప్రమాణాలు ఆధారంగా గ్రామీణపాలన-అవగాహన, అనుభవ పర్యటన కార్యక్రమంలో భాగంగా తమిళనాడు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖకి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం సందర్శించారు. హైదరాబాద్ సెంటర్‌ఫర్‌గుడ్‌గవర్నెన్స్ వారు సమన్వయం చేశారు. ఈసందర్భంగా ప్రతినిధుల బృందం గ్రామంలో ట్రాన్సిట్ వాక్ నిర్వహించి గ్రామంలో చేపట్టిన అభివృద్ధిపనులను ప్రత్యక్షంగా వీక్షించారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి భోజనం రుచిచూశారు. క్రీడా ప్రాంగణం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలను పరిశీలించారు.

## సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

**గజ్వేల్ టౌన్, జూలై 10, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని శ్రీశిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, సాయిబాబాకు అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఆలయంలో మహిళాభక్తులు కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీగురుపీఠంలో ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, జూలై 10, ప్రభాతవార్త:**
మండలంలోని గూడూరు గ్రామంలో శ్రీగురుపీఠం చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ జిన్నారం శివకుమార్‌గౌడ్, రమాదేవి దంపతులు నూతనంగా నిర్మించిన శ్రీ గురుపీఠంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్ ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రుల వామనశర్మ పర్యవేక్షణలో మంత్రోచ్చారణల మధ్య దత్తాత్రేయస్వామి, సాయిబాబాకు ప్రత్యేకపూజా కార్యక్రమాలు, హోమము, అభిషేకము నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, డిఎస్‌పి నరేందర్‌గౌడ్‌లు హాజరై మొక్కలు చెల్లించుకున్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు యాదగౌడ్, ములుగు నాగేశ్వరరావు, మండల ప్రధానకార్యదర్శి తాటికొండ శేఖర్‌గౌడ్, మాజీసర్పంచ్‌లు స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, గైనిభైటి శ్రీనివాస్‌గౌడ్, పత్రాల శ్రీనివాస్‌గౌడ్, కన్నారం దుర్గేష్, బాలమణి నరేందర్, చంద్రకళ శ్రీశైలం, శ్రీగురుపీఠం ట్రస్టు సభ్యులు రాజం బిక్షపతి, హనుమంత్, కుమ్మరి భాస్కర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

## ఆచూకీలేని మృతుల కుటుంబాలను ఆదుకోండి

**-న్యాయం చేసే వరకు బిఆర్ఎస్ పోరాటం ఆగదు**
**-అదనపు కలెక్టర్‌తో వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి**



అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆదర్శ్‌రెడ్డి దృశ్యం

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో ఆచూకీలేకుండా పోయిన 8మంది కార్మికుల కుటుంబాలకు కోటిరూపాయల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, కార్మిక కుటుంబాలను ఆదుకునేంత వరకు బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా అదనపుకలెక్టర్ చంద్రశేఖర్‌ను తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆదర్శ్‌రెడ్డి పటాన్‌చెరు మాజీ జడ్పిటిసి సభ్యులు శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి కలుసుకున్నారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు, వారిలో 61మంది సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారని, 16మంది ఆసుపత్రుల్లో చికిత్సలు అందుకుని ఇళ్లలో విశ్రాంతి తీసుకుంటున్నారన్నారని, 14మంది ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స అందుకుంటున్నారని, అందులో 5గురికి తీవ్ర గాయాలు అయినట్లు, 44మంది మరణించినట్లు ఇంకా 8మంది కార్మికుల ఆచూకీలేకుండా పోయిందని విచారం వ్యక్తంచేశారు. బాధ్యులకు కోటిరూపాయలు పరిహారం మంజూరు చేస్తామని కర్మాగార యాజమాన్యం హామీ చేసిందని, కార్మికులకు వెంటనే న్యాయంచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీకార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ నాయకులు కృష్ణకాంత్, మేరాజ్‌ఖాన్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బర్దీపూర్‌లో వైభవంగా శోభాయాత్ర

**ఝరాసంగం, జూలై 10, ప్రభాతవార్త:**
గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేడుకలను పురస్కరించుకుని ఉదయం కేంద్రమంత్రి భగవత్ ఖూభ ఆశ్రమంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమపీఠాధిపతులు 1008 వైరాగ్యశిఖామణి అవధూత గిరిమహారాజ్ (అప్పగారు), మహామండలేశ్వర్ డాక్టర్ సిద్దేశ్వరానందగిరిలను రథంలో యువకులు భజనలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలుచేస్తూ మంగళవాయిద్యాల మధ్య గ్రామంలోని పురవీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, విశ్వమానవ ధర్మప్రచారం సభ్యులు శేరి నర్సింగ్‌రావు, తెలంగాణ జానపద గాయకురాలు రేలారే గంగాల ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతులకు తులాభారం, పాదపూజ కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం వైదిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను ఆశ్రమానికి ఆహ్వానించి తమ తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## అయ్యప్పస్వామి ఆలయనిర్మాణం కార్తీకమాసం నాటికి పూర్తి చేయాలి

**-అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు డి.అశోక్‌గౌడ్**

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌పట్టణంలో నర్సాపూర్-హైద్రాబాద్ జాతీయ రహదారిలోని పందివాగు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅయ్యప్పదేవాలయం నిర్మాణంలో అయ్యప్ప భక్తులందరూ సహకరించి తమవంతు బాధ్యత వహించి సహకరించాలని, దీంతో ఈ ఆలయనిర్మాణం కార్తీకమాసం వరకు పూర్తి చేయాలని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయనిర్మాణ కమిటీ అధ్యక్షులు దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప ఆలయం ఆవరణలో భక్తులతో సమావేశాన్నినిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షతవహించిన అశోక్‌గౌడ్ మాట్లాడుతూ శ్రీఅయ్యప్ప దేవాలయనిర్మాణ పనులు రెండునెలల్లో పూర్తిచేసి కార్తీకమాసంలో ఈదేవాలయం ప్రారంభోత్సవాన్ని చేసుకోవాలన్నారు. నిర్ణయించిన సమయానికి ఆలయ నిర్మాణం పూర్తిచేయాలని అశోక్‌గౌడ్ సూచించారు. కార్యక్రమంలో గురుస్వాములు శంకర్‌రెడ్డిస్వామి, దేవాగౌడ్, నాగరాజు, నర్సాగౌడ్ రాములు, రాజపేట అశోక్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, మహేష్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, పూజిత నాగరాజు, వేణు, వెంకటేష్‌యాదవ్, శ్రీశైలం, సదానంద్‌గౌడ్, గోపిగౌడ్, రాజుగౌడ్, మహేష్, నాగులపల్లి అశోక్, జగన్నాయక్, కార్తీక్, శ్యామ్, నరసింహగౌడ్‌తోపాటు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## ఆశ్రమపాఠశాలను తనిఖీచేసిన నారాయణజాదవ్



ఆశ్రమపాఠశాలను తనిఖీచేస్తున్న నారాయణజాదవ్

**నాగల్‌గిద్ద, జూలై 10, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని గురుకుల ఆశ్రమ పాఠశాలను గురువారం జిల్లా కాంగ్రెస్ ఎస్టిసెల్ అధ్యక్షులు నారాయణజాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా నారాయణజాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు కాంగ్రెస్‌ప్రభుత్వం చేయుత అందిస్తోందన్నారు. విద్యార్థుల మెనూచార్జీలను పెంచినట్లు గుర్తుచేశారు. విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించి తగుసూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

**-కార్పొరేటర్ పుష్పనగేష్**



అండర్‌గ్రౌండ్ డ్రైనేజిపనులకు శ్రీకారం చుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:**
గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురు వారం రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని అశోక నగర్‌కాలనీలో విఘ్నేశ్వరుడి ఆలయంలో కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పుష్పనగేష్ దంపతులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలో 12.50లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులకు కార్పొరేటర్ పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈ సురేష్, జలమండలి మేనేజర్ లోకేష్, నాయక్, కాలనీ అధ్యక్షులు శేషరెడ్డి, రాజేష్, అమృత్‌సాగర్, నర్సింహాచారి, కలీమ్, సంభాషణరావు, ప్రమోద్‌గౌడ్, పవన్, కృష్ణమూర్తి, జ్యోతి పాల్గొన్నారు.

## శాకాంబరీదేవిగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

**-శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు**

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీమాత ఆలయంలో ఆషాఢమాస గురుపూర్ణిమను పురస్కరించుకొని నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీమాతకు ప్రత్యేకపూజలు చేశారు. ఈమేరకు అమ్మవారు శాకాంబరీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్యవైశ్య సభ్యులందరూ శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి నియమనిష్ఠలతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలందరూ శ్రీలలితాసహస్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శి మల్లేశంగుప్తా, కోశాధికారి హరీష్‌గుప్తా, బొర్లెపు శ్రీనివాస్‌గుప్త, నోముల శ్రీనివాస్‌గుప్తా, రేఖ వెంకటేష్‌గుప్తా, మిర్యాల చంద్రశేఖర్‌గుప్త, నవీన్‌గుప్త, ప్రభుశంకర్‌గుప్తా, ప్రవీణ్‌గుప్త, భక్తులు, ఆర్యవైశ్య మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ డైరెక్టర్లకు ఘన సన్మానం

**గజ్వేల్, జూలై 10, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, నాచారం దేవస్థానం డైరెక్టర్‌గా, ప్రజ్ఞాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండు లక్ష్మణ్ కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా గురువారం గజ్వేల్‌లో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పద్మశాలిసంఘం పట్టణయువజన అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గజ్వేల్ ఎఎంసి వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, గుంటుకు శ్రీనివాస్, అజార్, షాహిద్, కప్ప భాస్కర్, రాజుగౌడ్, గాజుల శ్రీనివాస్, అరుణ్, చెప్యాల శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక పంపిణీ

**-నర్సాపూర్ ఎంపిడివో మధులత**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో మధులత తదితరులు

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని ఎంపిడివో మధులత సూచించారు. గురువారం నర్సాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఎంపిడివో మధులత అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపిఓ, ఎపిఓ, ఈసి టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా అధ్యక్షత వహించిన ఎంపిడివో మధులత మాట్లాడుతూ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇళ్లనిర్మాణం కోసం ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఉపాధిహామీ పథకంద్వారా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో టిఎ, ఎఫ్ఎలు సుమారు 650మొక్కలు నాటాలని ఆమె సూచించారు. అంతేగాక పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంచేసి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల నిర్వహణ కోసం కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని అన్నారు. వీటితోపాటు గ్రామంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడివో మధులత సూచించారు. ఈమేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బేస్మెంట్ బిల్లులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో మధులతతోపాటు ఎంపిఓ వైద్య శ్రీనివాస్, ఎపిఓ అంజిరెడ్డి, ఈసి అసిస్టెంట్, హౌసింగ్ ఎఈ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రామ్‌రావ్ మహారాజ్ జయంతి వేడుకలు



రామ్‌రావ్ మహారాజ్ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

**చౌటకూరు, జూలై 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బొమ్మరెడ్డిగూడెం గ్రామంలో గురువారం శ్రీభవానిమాత సేవాలాల్‌మహారాజ్ ఆలయంవద్ద బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం బాలబ్రహ్మచారి సంత్‌తపస్వ రామ్‌రావ్‌మహారాజ్ 90వ జయంతి వేడుకలను, గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగ్‌బండార్, భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని గిరిజన బాలుర పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్, విశ్రాంత వార్డెన్ ఖోల పాండురంగం, రామావత్ పాండురంగ, ఖోల విఠల్, మాజీ సర్పంచ్ మమతరఘునాయక్, రవీందర్‌నాయక్, మాజీ ఎంపిటిసి సభ్యులు సుదర్శన్, నందుసింగ్ రాథోడ్, దేవిదాస్, నేనావత్ కిషన్, మేగావత్ రాములు, ఖోల బాల్సింగ్, నేనావత్ దేవి, నరేందర్, సురేందర్, ప్రశాంత్, ఒంసింగ్, బాబూలాల్, విగ్యా, శంకర్, శివ, బద్యా, సుకుమార్, జూదావత్ పాండ్యా, సర్వన్, నితిన్, రెడ్డి అభిలాష్, రవి, సుదీప్, ఆశ్రమపాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గోరింటాకు మహోత్సవం



గోరింటాకు మహోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

**సదాశివపేట, జూలై 10, ప్రభాతవార్త:**
వీరశైవ లింగాయత్ సమాజం ఎల్ల బజార్ మహిళా విభాగం వారిచే ఆషాఢమాస సందర్భంగా గోరింటాకు మహోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షులు గందిగే రాజు మాట్లాడుతూ ఆషాఢమాస సందర్భంగా గోరింటాకు మహోత్సవం ఏర్పాటుచేయడం జరిగిందని రాబోవురోజుల్లో మహిళాదినోత్సవం, కార్తీక వనభోజనాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటుచేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్, మాజీ కౌన్సిలర్ మంజుల, సంధ్య, కవిత, పల్లవి, లలిత, సావిత్రి, అర్చన, సిద్దమ్మ, మహాలక్ష్మి ౖ, శ్రీదేవి, రమా, శోభ, మల్లేశ్వరి, అన్నమ్మ, చామంత, అపర్ణ, గీత, సవిత, స్వాతి, మంజుల, రాజేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్ల పంపిణీ

**న్యాల్‌కల్, జూలై 10, ప్రభాతవార్త:**
మ్యాజిక్ స్పోర్ట్స్ సౌజన్యంతో మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 60మంది విద్యార్థులకు బూట్లను పంపిణీచేశారు. కార్యక్రమానికి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా పాల్గొని చిన్నారులకు బూట్లను అందచేసి మ్యాజిక్ స్పోర్ట్స్ బాధ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మండల మహిళానాయకురాలు మల్లికారెడ్డి, విద్యాకమిటి చైర్మన్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు కమలమ్మ, రాణమ్మ, ఎఎన్ఎం పుణ్యవతి, ఆశావర్కర్ సూర్యకళ, అంగన్‌వాడీ ఆయలు నిర్మల, అమూల్య, చాంద్‌బీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో గురుపూజోత్సవం

**-ఆసుపత్రిలో అన్నదానం వితరణ**

**జహీరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:**
గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో సంత్ శ్రీరామ్‌రావ్‌మహారాజ్ జ్ఞాపకార్థం శ్రీనివాస్‌పవార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో వైద్యం అందుకుంటున్న రోగులకు పండ్లు పంపిణీచేసి అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు డాక్టర్ శ్రీదర్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ శేషురావు, టిబిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ తులసిరామ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌చౌహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ బానోత్, మాజీ సర్పంచ్‌లు కేసుసింగ్ రాథోడ్, నారాయణజాదవ్, ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాషు బానోత్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు రవీందర్ చౌహాన్, మండల అధ్యక్షులు ధర్మ, నాయకులు శ్రీనివాస్ బానోత్, రామ్‌సింగ్‌నాథ్, సిఎస్ఐఎఫ్ పాండు, శివాజీ, మోహన్‌కృష్ణ, చందర్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీచేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీచేయడం జరిగింది. ఈమేరకు నర్సాపూర్ నియోజకవర్గంలోని పలుమండలాలకు చెందిన లబ్దిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతులమీదుగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్, భోగ శేఖర్, బిక్షపతి, సత్యంగౌడ్, మహమ్మద్, వెంకట్‌గౌడ్, విట్టల్, ఆంజనేయులుగౌడ్, ఆనంద్‌కుమార్, తొంట వినయ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధియే లక్ష్యం

**నంగునూర్, జూలై 10, ప్రభాతవార్త:**
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎపిఎం మహిపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రమాద బీమా, లోన్ బీమా వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి మహిళల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిసిలు పంగ లింగం, మల్లేశం, వివోఏలు వెంకటలక్ష్మీ, ఉమా, భాగ్యలక్ష్మీ, వివో లీడర్లు గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీకి ఆయాను నియమించాలి

**-దాసరి ఏగొండస్వామి**

**గజ్వేల్ టౌన్, జూలై 10, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఆయా లేకపోవడంతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. గురువారం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగు సంవత్సరాలుగా అంగన్వాడీ కేంద్రంలో ఆయా లేకపోవడం వల్ల వంట చేయడానికి అంగన్వాడీ టీచర్‌కు, వాష్‌రూమ్‌కు వెళ్ళడానికి పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే అంగన్వాడీ కేంద్రానికి ఆయాను నియమించడంతో పాటు నీళ్ల సదుపాయం, బాత్రూమ్‌ల సౌకర్యం కల్పించాలన్నారు.